ఒట్టు..ఒక్క నీటి బొట్టు వృథా కాదు



గౌడనహళ్లిలో పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత



బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

- ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి వృథా నీరు
- ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతల తవ్వకాలు
- భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మడకశిర రూరల్: సమస్త ప్రాణకోటికి నీరే ప్రాణాధారం. దాహం తీరాలన్నా, పంటలు పండాలన్నా జలమే ఆధారం. అంతటి ప్రాధాన్యత ఉన్న నీటిని సంరక్షించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జల సంపదను పెంపొందించేందుకు ఉపాధిహామీ పథకం కింద ఇంకుడు గుంతల తవ్వకానికి శ్రీకారం చుట్టింది. మడకశిర, అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల మండలాల్లోని ఖాళీ స్థలాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద 44 ఇంకుడు గుంతల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ఒక్కో దానికి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు ఉపాధి హామీ నిధులు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే 30 చోట్ల ఇంకుడు గుంతల పనులు పూర్తి చేసి వర్షపు నీరు నిల్వ అయ్యే విధంగా సిద్ధం చేశారు. 14 చోట్ల గుంతల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాల భవనాలపై పడిన వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతలు తీయించి ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకిపోయే విధంగా కృషి చేస్తున్నారు. నీటి పొదుపు, భూగర్భజలాలు పెంపుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాఠశాల, సచివాలయాల వద్ద ఉన్న బోరు బావుల్లో మరింతగా భూగర్భజల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

త్వరగా పూర్తి చేస్తాం



ఉపాధి హామీ పథకం ద్వారా పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే జల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

శ్రీకాంత్‌గౌడు,
ఉపాధి హామీ పథకం ఏపీఓ,
మడకశిర మండలం

క్లుప్తంగా

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం చెకుముకి టెస్ట్ పోస్టర్లను ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి విడుదల చేశారు. ఈనెల 10న పాఠశాల స్థాయిలో 8,9,10 విద్యార్థులకు ఈటెస్ట్ నిర్వహిస్తారు. అదేవిధంగా మండల స్థాయిలో ఈనెల 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న ఈటెస్ట్‌ను నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ టెస్ట్‌ను రాయవచ్చని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు తెలిపారు. జేవీవీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మడకశిర జేవీవీ అధ్యక్షుడు రమేష్,ప్రధాన కార్యదర్శి మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సత్వరమే బిల్లులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలోని ఆర్బీకే, సచివాలయం, విలేజ్ క్లినిక్‌ల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎంపీపీ ఈరన్నతో కలిసి గురువారం ఆయన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణాలు ఏఏ దశలో ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు త్వరగా మంజూరు చేస్తున్నందున పనులు కూడా వేగవంతంగా పూర్తి చేసి డిసెంబర్ ఆఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు.

భవన నిర్మాణాల పరిశీలన



రైతు భరోసా కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లేపాక్షి: లేపాక్షిలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్, ఎంపీడీఓ నరసింహనాయుడు, జేఈ హనుమేనాయక్ గురువారం పరిశీలించారు. సిబ్బందికి, పనులపై వచ్చే ప్రజలకు, ఉద్యోగులకు కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

లేపాక్షి: మండలంలోని పి.సడ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉదయం విద్యార్థులు మొక్కలు నాటారు. హిందూపురం తపాలా శాఖ హెడ్ పోస్టుమాస్టర్ మార్కండేయ జన్మదినం సందర్భంగా మొక్కలు అందజేయగా వాటిని విద్యార్థులు నాటారు. జ్యోతి, భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం శోభ పాల్గొన్నారు.

డిప్యూటీ సర్వేయర్‌కు సన్మానం



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: మడకశిర మున్సిపల్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న మండల డిప్యూటీ సర్వేయర్ కిరణ్‌కుమార్‌ను గురువారం కార్యాలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, డీటీ భాగ్యలక్ష్మీ, ఆర్‌ఐలు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు జూనియర్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

చిలమత్తూరు: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ గురువారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు..

గోరంట్ల: ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్త గురువారం తెలిపారు. అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలన్నారు. అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం





మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మందుల కిట్లు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్ వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. 14వ వార్డు ఇందిరానగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు చేయించి నాణ్యమైన మందులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అనంతరం స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద మెరుగైన వైద్యం అందించేందుకు సిఫార్సు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్తీ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, కాణిపాకం ఆలయ కమిటీ డైరెక్టర్ రవీంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ ఆధ్వర్యంలో జనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్ హాజరై మాట్లాడారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం శిబిరంలో వైద్యులు రోగులకు వైద్య సేవలు అందజేశారు. వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని ప్రోత్సహిస్తే సమాజానికి ముప్పు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అంజినరెడ్డి

లేపాక్షి: అవినీతిని ప్రోత్సహిస్తే సమాజానికే ముప్పు వాటిల్లుతుందని లేపాక్షి వైస్ ఎంపీపీ అంజినరెడ్డి తెలిపారు. లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు నిర్వహించారు. పురావస్తు శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరాంజినేయులు మాట్లాడుతూ లంచం తీసుకోవడం, ఇవ్వడం కూడా నేరమేనన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం గురుకుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పురావస్తు శాఖ జిల్లా అధికారి బాలకృష్ణారెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఈఓఆర్‌డీ శివన్న, ఆర్‌ఐ ప్రమీలమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న కేంద్రం



ప్రజారక్షణ బస్సు యాత్రలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్

హిందూపురం టౌన్: సీపీఎం చేపట్టిన ప్రజారక్షణ బస్సు యాత్ర శుక్రవారం హిందూపురం చేరుకుంది. తెలుగుతల్లి సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు స్వాగతం పలికి ర్యాలీగా పట్టణంలోకి చేరుకున్నారు. స్థానిక బీపీఎల్ షోరూమ్ వద్ద సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను, రైతు చట్టాలను సవరిస్తూ, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజాధనాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే పనిలో ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, ఓబులు, దయ రమాదేవి, శివ, నాగరాజు, నల్లప్ప, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న మోతిరాంనాయక్

రొళ్ల: సహకార బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మధుడి సహకార బ్యాంక్ మేనేజర్ జయరామ్‌చౌదరి పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో డైరెక్టర్లు, రైతులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర బ్యాంకులకన్నా ఏడీసీసీ బ్యాంక్‌లో వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు తక్కువ వడ్డీకే అందజేస్తారన్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డైరెక్టర్లు ప్రకాష్‌గౌడు, తిప్పేమల్లప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్, అసిస్టెంట్ మేనేజర్లు గోవిందరెడ్డి, పాపిరెడ్డి, సీఈఓ హనుమంతరాయ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రైల్వే బ్రిడ్జిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అస్సార్ వీధికి చెందిన మున్వర్ కుమారుడు మహమ్మద్ సిద్దిక్ ద్విచక్ర వాహనంలో గురువారం సాయంత్రం దుర్గానగర్‌లోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. దుర్గానగర్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సిద్దిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సిద్దిక్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటకకు వెళ్లి పింఛన్ అందజేత



మధుగిరిలో సాకమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ లత

మడకశిరరూరల్: కదిరేపల్లి గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారురాలు సాకమ్మకు గ్రామ వలంటీర్ లతా గురువారం కర్ణాటకలోని మధుగిరికి వెళ్లి పింఛన్ అందజేశారు. సాకమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మూడు నెలలుగా మధుగిరిలోని కుమార్తె ఇంటిలో ఉంటోంది. దీంతో వలంటీర్ లత సుమారు 45 కిలో మీటర్లు ప్రయాణించి సాకమ్మకు పింఛన్ అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.లక్ష అందజేత

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్ కుమారుడు ఎ.కౌసర్‌కు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చెవికి శస్త్ర చికిత్స జరిగింది. బాధితుడు సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.లక్ష మంజూరైంది. ఎమ్మెల్యే తిప్పేస్వామి గురువారం తన కార్యాలయంలో అల్లాబకాష్‌కు చెక్కు అందజేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు అల్లాబకాష్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కెంచెప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న మద్దనకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కెంచప్పను ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి శుక్రవారం పరామర్శించారు. వైద్యులు ఇచ్చిన మందులను పరిశీలించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం అందేలా కృషి చేస్తానని, అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను బోధించండి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీవైఈఓ రంగస్వామి

రొళ్ల: ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని పెనుకొండ డీవైఈఓ రంగస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లల చదువుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి తరగతిలోను ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉందని, ఆ స్థానంలో క్వాలిఫై అయిన టీచర్ ఉంటే తాత్కాలికంగా నియమించాలని ఎంఈఓ-2 శ్రీధర్‌కు సూచించారు. హెచ్‌ఎం స్నేహలత మార్గరేట్, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా పని చేయండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

గుడిబండ: మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని, ఇందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా గ్రామ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న నాయకత్వంలో మండలంలోని చెరువులను కృష్ణాజలాలతో నింపి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పక్కా గృహాల మంజూరుకు హౌసింగ్ శాఖ ప్రతిపాదనలు పంపిందని, మంజూరైన వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విధులకు సక్రమంగా హాజరు కాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ భూతరాజు, కో ఆప్షన్ సభ్యుడు తౌఫీక్, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ నాగభూషణం, మండల కన్వీనర్ యంజారేగౌడు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలపై బెయిల్ ఇస్తే విజయోత్సవాలా?

- టీడీపీ నాయకులు 'నిజం తెలుసుకోవాలి'
- హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక



మాట్లాడుతున్న టీ ఎన్.దీపిక

హిందూపురం: అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకునేందుకు చంద్రబాబుకు కొన్ని రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరైతే నిజం గెలిచిందంటూ టీడీపీ నాయకులు విజయోత్సవ ర్యాలీలు చేయడం హాస్యాస్పదంగా ఉందని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపిక అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఖైదీలకు అనారోగ్య కారణాలు ఉంటే కోర్టులు బెయిల్ ఇవ్వడం సాధారణమేనన్నారు. చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందన్నారు. కంటి చికిత్స కోసం హైకోర్టు నాలుగు వారాలపాటు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు పాత్ర ఉందనేది అందరికీ తెలిసిందేనన్నారు. ఈకేసులో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ కీలకంగా ఉన్నారని, ఆయన్ను విదేశాలకు పంపించి విచారణకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని చెప్పారు. బెయిల్ గడువు ముగిశాక మళ్లీ చంద్రబాబు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని గుర్తుచేశారు. టీడీపీ నాయకులు ఈ వాస్తవాన్ని గుర్తించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు ఉత్సవాలు, ర్యాలీలు జరుపుకోవడం చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు.

సక్రమంగా విద్యుత్ అందిస్తుంటే ధర్నాలా ?

రొళ్ల: సీఎం వైఎస్ జగన్ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందిస్తుంటే విద్యుత్ కోతలంటూ టీడీపీ నాయకులు ఆందోళనలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కరోజు కూడా సమస్యలు లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేశారని, దీనిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారన్నారు. గుడ్డగుర్కి, దొడ్డేరి పంచాయతీలలో ఎమ్మెల్యే తిప్పేస్వామి సహకారంతో త్వరలో విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు జరగనున్నాయన్నారు. దీంతో లోఓల్టేజీ సమస్య కూడా పరిష్కారమవుతుందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ కార్యకర్తలు గమనించాలని హితవు పలికారు. టీడీపీ హయాంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. ఇప్పుడు రైతుల సమస్యలపై పోరాడుతున్నామని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన శ్మశాన వాటికకు రూ.20 లక్షలతో చేపట్టిన ప్రహరీ పనులను ఎమ్మెల్యే తిప్పేస్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు శ్మశాన వాటిక లేకపోతే ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూమిని ఆయా కమ్యూనిటీ కోసం కేటాయించాలని గతంలో సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. తన సొంత గ్రామంలో రూ. 20 లక్షలు వెచ్చించి శ్మశానానికి ప్రహరీ నిర్మాణం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

నేడు రాగుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అమరాపురం: మండలంలోని హాలుకూరు, కె.శివరం ఆర్బీకేలో శుక్రవారం రాగుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి మంజునాథ తెలిపారు. ఖరీఫ్‌లో పండించిన రాగులను రైతులు ఈ కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.3846తో కొనుగోలు చేస్తారని తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

అమరాపురం: స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు, మండల జేసీఎస్ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న కాడు గొల్లలు

పావగడ: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించాలని డిమాండ్ చేస్తూ కాడు గొల్లలు గురువారం తాలూకా కార్యాలయం ముందు ధర్నా చేశారు. సంఘం తాలూకా అధ్యక్షుడు ఎస్ బోరప్ప మాట్లాడుతూ కాడు గొల్లలకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు ఇవ్వాలని 2018లోనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయినప్పటికీ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయలేదన్నారు. దీంతో కాడు గొల్లలు విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు అందజేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.